ఎమ్మార్సీల్లో ఆన్‌లైన్ సేవలు





- 12 కేంద్రాలకు 72 కంప్యూటర్లు మంజూరు
- ఎప్పటికప్పుడు వివరాల నమోదుకు అవకాశం
- సిబ్బందికి తప్పనున్న ఇబ్బందులు

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 2: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ కార్యాలయాల్లో వసతులు కూడా సమకూర్చాలని నిర్ణయించింది. ఈ క్రమంలో జిల్లాలోని మండల రిసోర్స్ సెంటర్ల (ఎమ్మార్సీ)లలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చింది. జిల్లాలోని 12 మండలాలకు కంప్యూటర్లు, ఒక్కో ప్రింటర్‌ను సమకూర్చింది.

12 ఎమ్మార్సీలకు..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 15 ఎమ్మార్సీలు ఉన్నాయి. వీటిలో 12 ఎమ్మార్సీలకు ఆరు కంప్యూటర్ల చొప్పున 72 కంప్యూటర్లు మంజూరయ్యాయి. వీటితో పాటు 12 యూపీఎస్‌లు, ఇతర సామగ్రి అందజేశారు. నూతనంగా ఏర్పడిన చింతలమానేపల్లి, పెంచికల్‌పేట, లింగాపూర్ మండలాలకు మంజూరు కాలేదు. ప్రస్తుత కాలంలో విద్యార్థులకు సాంకేతిక విద్య అత్యవసరంగా మారింది. ఈ తరుణంలో 2006లో ఎంపిక చేసిన పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం కంప్యూటర్లు అందజేసింది. కొంత కాలం సవ్యంగానే బోధన సాగింది. అనంతరం బోధకులు లేక పోవడంతో కంప్యూటర్లు నిరుపయోగంగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పరిషత్, యూపీఎస్ పాఠశాలలకు కంప్యూటర్లు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పాఠశాలల్లో మళ్లీ బోధకులు లేకండా కంప్యూటర్లు అందిస్తే పాతకథే పునరావృతం అయ్యే పరిస్థితి ఉంది. ప్రభుత్వం కంప్యూటర్లు అందజేయడమే కాకుండా ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

ఉపయోగం ఇలా..

విద్యార్థుల వివరాల నమోదు, పాఠశాలలోని సౌకర్యాలు, టీచర్ల వేతనాల బిల్లులతో పాటు మధ్యాహ్న భోజనం తయారు చేసే వారి వివరాలు నమోదు చేసేందుకు సీఆర్పీలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం కంప్యూటర్లు సమకూర్చింది. మండల వనరుల కేంద్రంలో కంప్యూటర్లను అందుబాటులో ఉంచడం ద్వారా క్షేత్రస్థాయిలోని పాఠశాలల వివరాలను నమోదు చేసే సమయంలో ఇబ్బందులు తప్పనున్నాయి.

సమగ్ర సమాచారం నమోదు..

ఉదయ్‌బాబు, ఇన్‌చార్జి డీఈవో



రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మార్సీలకు కంప్యూటర్లు, ప్రింటర్‌ను అందిస్తుంది. దీని వల్ల మండలంలోని పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని నమోదు చేయవచ్చు. జిల్లాలోని 12 ఎమ్మార్సీలకు కంప్యూటర్లు మంజూరయ్యాయి.

జిల్లా అభివృద్ధికి పాటుపడుదాం

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు

ఆసిఫాబాద్, జనవరి 2: జిల్లా అధికార యంత్రాంగం ఐక్యంగా పని చేసి జిల్లాలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేద్దామని జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అధికారులు, కలెక్టరేట్ అధికారులు కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షల తెలిపి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో సురేష్, ఏడీ సోమేశ్వర్, డీఎస్‌వో తారామణి, ఆసిఫాబాద్ సబ్ జైలర్ ప్రేంకుమార్, వసతి గృహ సంక్షేమాధికారులు, టీఎన్‌జీవోఎస్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: పీఆర్టీయూటీఎస్, టీఎస్‌టీడబ్ల్యూటీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ హేమంత్ బోర్కడే చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో గిరిజనసంక్షేమ శాఖ డీడీ రమాదేవి, పీఆర్టీయూ, టీఎస్‌టీడబ్ల్యూటీయూ సభ్యులు శ్రీనివాసరావు, ప్రకాష్, భిక్షపతి, శంకర్, హనుమంతు, సత్యనారాయణ, సాంబశివరావు, రవిశంకర్, లవన్‌కుమార్, గోవిందరావు, సత్యనారాయణ, లక్ష్మయ్య, ఉద్ధవ్, మీనారెడ్డి, కిష్టయ్య, శకుంతల పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

రెబ్బెన, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమం ద్వారా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేట్టు తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. మంగళవారం రెబ్బెన రోళ్లపాడులో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలాలు, పట్టణాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో 365 గ్రామ పంచాయతీలు, 1 మున్సిపాల్టీ ఉన్నట్టు, ఇందుకు 1,335 కౌంటర్లను ఏర్పాటు చేశాని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీనివాస్, సర్పంచి పోచయ్య, ఏవో మంజుల, ఏపీవో రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



బహుమతి అందజేస్తున్న కమిటీ సభ్యులు

సిర్పూర్(యు), జనవరి 2: మండలంలోని మహగాం పటేల్‌గూడలో మూడు రోజులుగా కొనసాగుతున్న కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. సర్పంచ్ ఆత్రం పద్మబాయి జై హనుమన్ యూత్ అసోసియషన్ సభ్యుడు కోడప గంగారాం పటేల్ విజేతగా నిలిచిన ఆదిలాబాద్ జట్టుకు బహుమతి అందజేశారు. కాగా ఈ పోటీల్లో రెండో స్థానంలో జారుగూడ, మూడో స్థానంలో జైనూర్ జట్లు నిలిచాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ క్రీడలతో యువతకు మానసికోల్లాసం కలిగిస్తుందన్నారు. యువత చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గెడం హనుమంత్‌రావు, సేడ్మకి రామారావు, గెడం క్రిష్ణ, ఆత్రం రాజేశ్వర్, రాయిసెంటర్ సార్‌మేడి ఆత్రం ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

సిర్పూర్(యు), జనవరి 2: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన అవసరం ఉందని మహగాం స్కూల్ కాంప్లెక్స్ ఎస్‌సీఆర్పీ సిర్మోల మారుతి అన్నారు. మండల కేంద్రంలోని ప్రెసిడెంట్‌గూడ గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యా బోధన తీరును పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఆత్రం ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మెంగుబాయిగూడలో పశువైద్య శిబిరం

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 2: మండలంలోని మెంగుబాయిగూడ గ్రామంలో నాబార్డు ఆర్థిక సహాయంతో వాసన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణ పశువులకు టీకాలు వేశారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పశుపోషకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ పురుషోత్తం, ప్రశాంత్, వాసన్ ఆర్గనైజేషన్ సభ్యులు జయవర్ధన్, భీందాస్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ జయంతికి సెలవు ప్రకటించాలి

ఆసిఫాబాద్, జనవరి 2: బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని మంగళవారం గోర్ సేన ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఫిబ్రవరి 15న జరిగే జయంతి వేడుకలకు సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌నాయక్, ప్రవీణ్, విఖిల్, రాజేందర్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి సాఫ్ట్ బాల్ జట్ల ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్, జనరి 2: ఆసిఫాబాద్ పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలలో బుధవారం అండర్-14 సాఫ్ట్‌బాల్ జోనల్ స్థాయి జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు క్రీడల ప్రధాన కార్యదర్శి సాంబశివరావు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 6న నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహించేపోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

6 నుంచి హనుమాన్ దీక్షలు ప్రారంభం

ఆసిఫాబాద్, జనవరి 2: హనుమాన్ దీక్షలు ఈ నెల 6 నుంచి 108 రోజులవి ప్రారంభించనున్నట్లు కేస్లాపూర్ హనుమాన్ ఆలయ అర్చకుడు శిరీష్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 12 తేది నుంచి మండల దీక్షలు, అర్థమండల దీక్షలు, ఏప్రిల్ 2 నుంచి ఏకాదశ దీక్షలు ఉంటాయని తెలిపారు.

అర్హులకు సంక్షేమ పథకాలు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

- అదనపు కలెక్టర్ దీపక్‌తివారి

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 2: అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుటామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని ఈదులవాడ గ్రామ పంచాయతీలో మంగళవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎంపీపీ అరిగెల మల్లికార్జున్‌తో కలిసి పరిశీలించారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన లబ్ధిదారులందరికి ఆరు గ్యారంటీ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రజాపాలన దరఖాస్తులు తీసుకుంటామన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రజాపాలన దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని ఎవరు కూడా బయట దరఖాస్తు ఫారాలు తీసుకోవద్దని అన్నారు. దరఖాస్తు ఫారాలు ఇచ్చేటప్పుడు ఇంటి యజమాని ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ పత్రాలు ఉంటే సరిపోతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, సర్పంచ్ భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆరు గ్యారెంటీల అమలు కోసం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీడీవో శివకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని జైతపూర్, బెండార, చిచ్చుపల్లి, నవేగూడ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కేంద్రాల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతోంది. మండలంలోని నాగల్‌గొంది గ్రామంలో ఎంపీడీవో మహేందర్ దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుకర్, ఏపీఓ మల్లయ్య సూపర్‌వైజర్ అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: అర్హులైన ప్రతి ఒక్కరు ప్రజాపాలన పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రాజేశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని దహెగాం, గెర్రె, గిరివెల్లి, కమ్మర్‌పల్లి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మి, ఏఎన్‌ఎం లక్ష్మి, కార్యదర్శి ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



చింతలమానేపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

చింతలమానేపల్లి, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని బాబాసాగర్, రవీంద్రనగర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సదస్సుల్లో మంగళవారం ఆయన మాట్లాడారు. ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనేతరులు పడుతున్న కష్టాలు అసెంబ్లీ సమావేశంలో చర్చకు తీసుకెళ్తానని అన్నారు. ప్రభుత్వాన్ని సంప్రదించి గిరిజనేతరులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. అనంతరం రూ.20 లక్షలతో చేపడుతున్న జీపీ భవనం పనులకు భూమి పూజ చేశారు. అంతకు ముందు రవీంద్రనగర్-2, చింతలమానేపల్లి గ్రామంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన తరు వాత మొదటి సారి గ్రామానికి రావడంతో బెంగాలీలు ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, తిరుపతిగౌడ్, మల్లయ్య, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, డీటీ మహ్మూర్ అలీ, ఎంపీపీ నానయ్య, నాయకులు నాజీం హుస్సేన్, సర్పంచ్ సుశీల, సుశీల్‌కుమార్, నానయ్య, శ్రీమన్నారాయణ, సత్తయ్య, సాయి, రంగన్న, మల్లేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: మండలంలోని కర్జవెల్లిలో అయోధ్య రామ్ లీలా మందిర పూజిత అక్షింతలను భక్తులు గ్రామంలోని ఇంటింటికి పంపిణీ చేశారు. రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ఆధ్వ ర్యంలో పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు భక్తులకు అక్షింతలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నానయ్య, రుషిశ్వర్, భక్తులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలను మంగళవారం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబుకు వీహెచ్‌పీ జాతీయ జాయింట్ సెక్రటరీ మలయన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, జిల్లా కోశాధికారి అరుణ్ కుమార్‌లోయ, భజరంగ్ దళ్ జిల్లా అధ్యక్షులు శివగౌడ్, రంగ స్వామి, శుభం లోయ, వలపదాసు, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి

సిర్పూర్(యు), జనవరి 2: గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని మంగళవారం ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌కు బండేయేర్ వీటీడీఏ చైర్మన్ కుమ్ర భీంరావు వినతి పత్రం అందజేశారు. బండేయేర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల రుద్రకసలో అంతర్గత రోడు సౌర్యకం లేక కోలం ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. గ్రామనికి సీసీ రోడ్డు మంజూరు చేయాలని కోరారు. బండేయేర్ పాఠశాలలో దాదాపు 90 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, పాఠశాలలో ఆట స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

జైనూర్, జనవరి 2: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని దీక్షగురువు ప్రేమ్‌సింగ్ మహరాజ్ అన్నారు. మండలంలోని రాంనగర్ తండాలో మంగళవారం దీక్షగురువు ప్రేమ్‌సింగ్ మహరాజ్ భోగ్ బండర్ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్షగురువు ప్రేమ్‌సింగ్ మహరాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడువాలని కోరారు. కార్యక్రమంలో భీంరావు నాయక్, హరి, అంబాజీ, జాదవ్ గణపత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు జీఎం శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలియజేస్తున్న జీఎం

శ్రీరాంపూర్, జనవరి 2: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావుకు శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి. సంజీవరెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను స్వయంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.. కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఓ మురళీమోహన్, పాల్గొన్నారు.

బలరాంకు ఏఐటీయూసీ నాయకుల అభినందన

శ్రీరాంపూర్, జనవరి 2: సింగరేణి సీఎండీ(పూర్తి అదనపు బాధ్యతలు)గా బాధ్యత లు చేపట్టిన డైరెక్టర్(ఫైనాన్స్, పా) ఎన్. బలరాంకు ఏఐటీయూసీ నాయకులు మంగళ వారం అభినందనలు తెలిపారు. ఆయనకు హైదరాబాద్‌లో పుష్పగుచ్ఛం అందించి కార్మిక సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి. సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శులు సారయ్య, వీరభద్రయ్య, వై.వి.రావు, ముస్కె సమ్మయ్య, మడ్డి ఎల్లయ్య పాల్గొన్నారు.

సీఎండీకి అభినందన



బలరాంను అభినందిస్తున్న జనక్‌ప్రసాద్

మందమర్రి, జనవరి 2: సింగరేణి డెరెక్టర్ ఫైనాన్స్ బలరాం సింగరేణి సీఎండీగా అదనపు బాధ్యతలు ఇవ్వడంతో మంగళవారం ఐఎన్‌యూసీ సెక్రటరి జనరల్ జనక్ ప్రసాద్ ఆయన కార్యాలయంలో కలిసి అభినందించారు. బల్‌రాంకు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి సంస్థ ప్రగతికి ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్లాలని, కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్‌రావు



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్‌రావు

శ్రీరాంపూర్, జనవరి 2: తాము గుర్తింపు సంఘం ఎన్నికల్లో తాము గుర్తింపు సంఘంగా ఎన్నిక కానప్పటికీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు అన్నారు. ఆర్కె 5 గనిపై మంగళవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 27న నిర్వహించిన ఎన్నికల్లో తాము ప్రాతినిధ్య సంఘం హోదాను పొందామన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశామని, ఆరు గ్యారంటీలను కార్మికులకు అందేలా చూస్తామన్నారు. ఐఎన్‌టీయూసీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, కేంద్ర కార్యదర్శి గరిగే స్వామి, ఏరియా కార్యదర్శి సమ్మిరెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, రాజన్న, మల్లారెడ్డి, సదయ్య, నంబయ్య, భీం రవి, జె నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బదిలీని ఉపసంహరించుకోవాలి

శ్రీరాంపూర్, జనవరి 2: మందమర్రి ఏరియా కేకే 5 గనిలో ఓవర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ బదిలీని నిలిపివేయాలని మైనింగ్ సిబ్బంది, కార్మికులు కోరారు. బదిలీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్కె 7 గనిపై నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. గుర్తింపు ఎన్నికల సందర్భంగా ఏఐటీయూసీ యూనియన్‌కు మద్దతు ఇవ్వలేదని ఆయనపై కక్షగట్టి కేకే 5 నుంచి కాసిపేట గనికి బదిలీ చేయించారన్నారు. ఇలాంటి చర్యలు యాజమాన్యం వెంటనే నిలిపివేయాలని, లేనిపక్షంలో దశలవారీగా అన్ని ఏరియాల్లో ఆందోళనలు చేపడతామని సీఐటీయూ డివిజన్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి అనిల్, రాకేష్, ప్రవీణ్, భగవాన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలుకు పోరాటాలు తప్పవు'

మందమర్రి, జనవరి 2: గుర్తింపు సంఘంగా ఎన్నికైన ఏఐటీయుసీ కార్మికులకు ఇచ్చిన హామీఉ అమలు చేయకుంటే పోరాటాలు చేస్తామని సీఐటీయు బ్రాంచి కార్యదర్శి ఎస్ వెంకటస్వామి, అల్లీరాజేందర్ తెలిపారు. మంగళవారం ఏరియాలోని కేకే 5గనిపై నిర్వహించిన గేటు మీటింగ్‌లో మాట్లాడదారు. కార్మికుల సొంతింటి కల, మారుపేర్ల మార్పు, ఇన్‌కం టాక్స్ రద్దు, తదితర డి మాండ్లను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. కార్మికులు ఎంతో నమ్మకంతో గుర్తింపు సంఘం ఎన్ను కు న్నారనే విషయాన్ని మరిచిపోవద్దని హితవు పలికారు. సింగరేణిలో తాము ప్రత్యామ్నాయ శక్తిగా, ప్రశ్నించే గొంతుగా పని చేస్తామని తెలిపారు. ఇచ్చిన హామీలను వెంటనే నేర్చేలాగా గుర్తింపు సంఘానికి కార్మికుల్లో మంచి ఆదరణ ఉంటుంద ని తెలిపారు.రా నున్న రోజుల్లో సింగ రేణికి కార్మికులకు పెను సవాళ్లు ఉన్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు అన్ని కార్మిక సంఘాలు కలిసి పని చేసే రోజులు రాబోతున్నాయని తెలిపారు. సమావేశంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యం

మందమర్రి, జనవరి 2: సింగరేణి సంస్థలో ఉపాధి అవకాశాలు పెంచడమే తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం మందమర్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో భూగర్భ గనులు, డిపార్టుమెంట్లలో ఓపెన్ కాస్టు, పవర్ ప్లాంట్‌లో స్థానికేతరులను తీసుకున్నారని, ఇకనుంచి అలాంటి నియమకాలు ఉండవని చెప్పారు. ఎవరికైనా ఎలాంటి సమస్యలున్నా నేరుగా సంప్రదిచ్చవని తెలిపారు. విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని జైపూర్ పవర్ ప్లాంట్‌లో 850 మెగావాట్లవి ద్యుత్ ప్లాంట్ ప్రారంభించాలని ప్రభుత్వం దృష్టితీసుకెళ్లినట్లు తెలిపారు. తమ నియోజకవర్గం పరిధిలో ఉన్నటువంటి భూగనులు, ఓపెన్ కాస్టుల్లో సంబంధించి కూడ అధికారులతో సమావేశాలు ఏ ర్పాటు చేస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ దాని అనుబంధ సంఘాల నాయకులు ఉపేందర్‌గౌడ్, రమేశ్, సుదర్శన్, సదానందంయాదవ్, నరేశ్, కాంపెల్లి సమ్మయ్య, దేవి భూమయ్య, మహంత్ అర్జున్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగు ఆకారంలో కానుగ వృక్షం

పెంచికలపేట, జనవరి 2: ప్రకృతి ఎన్నో అద్భుతాలకు, అరుదైన సంఘటనలకు నెలవు. వింతలు, విచిత్రాలకు ప్రకృతిలో పరిమితి అంటూ ఉండదనే చెప్పాలి. పెంచికలపేట మండల కేంద్రంలోన ఫారెస్టు కానుగ ప్లాంటేషన్‌లోని కానుగ చెట్టు రెండు కొమ్మల్లో ఒక కొమ్మనిటారుగా ఉంది. కాగా మరో కొమ్మ వంగి ఉండడంతో ఏనుగు ఆకారంలో కనిపిస్తోంది. దీంతో అటుగా వెళ్లిన వాళ్లు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



ఏనుగు ఆకారంలో ఆకట్టుకుంటున్న కానుగ చెట్టు

పోలీసు ఉత్తమ సేవా పతకానికి ఏఎస్ఐ ఎంపిక

ఏసీసీ, జనవరి 2: మంచిర్యాల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నీరటి రామరాజు పోలీసు ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు. ఈ మేరకు రామగుండ పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, ఈ నెల 26న నిర్వహించనున్న గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా సీపీ చేతులమీదుగా అవార్డు ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా పోలీసు సేవా పతకానికి ఎంపికవడం సంతోషంగా ఉందని ఏఎస్ఐ రామరాజు అన్నారు. అవార్డు రావడం తనపై మరింత బాధ్యత పెంచిందని తెలిపారు.

జిల్లా కలెక్టర్‌కు పలువురి శుభాకాంక్షలు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 2: కలెక్టర్ బదావత్ సంతోష్‌కు మంగళవారం ఆయా శాఖల ఉద్యోగులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. టీఎన్‌జీవో అనుబంధ కమిటీ సభ్యులు మల్లేష్, రమణ, సురేష్, విజయ, శ్రీదేవి, ప్రజ్ఞ, రాధ, పావణి పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేకు..

మందమర్రి టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్రజాపాలన కార్యక్రమానికి హాజరైన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాక్షలు తెలిపారు. ఆయనతో పాటు మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేత్రదాన శిబిరం విజయవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 2: జిల్లా కేంద్రంలో ఈ నెల 4న నిర్వహిస్తున్న నేత్ర దాన శిబిరాన్ని విజయవంతం చేయాలనిగర్మిళ్ల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గాజుల ముఖేష్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం సంబంధిత పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రంలో శంకర్ లింగం, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కాలువకు నీటి విడుదల తగ్గింపు

జగిత్యాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఎస్ఆర్ఎస్పీ నుంచి కాకతీయ కాలువ ద్వారా సరఫరా చేస్తున్న నీటి విడుదలను మంగళవారం అధికారులు తగ్గించారు. ఇప్పటివరకు 6 వేల క్యూసెక్కుల నీటిని కాలువకు విడుదల చేస్తున్నారు. కొద్ది కొద్దిగా 3,500 క్యూసెక్కులకు తగ్గిస్తున్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు సామర్థ్యం 90.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం డ్యామ్‌లో 70.67 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి డ్యామ్‌లో 79.621 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టు నుంచి 7,983 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో కాకతీయ కాలువకు ఆరు వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 472 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 500 క్యూసె క్కులు, మిషన్ భగీరథ పథకాలకు 152 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత యేడాది జూన్ ఒకటి నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 200.682 టీఎంసీల నీరు చేరింది.

రైతుల కష్టాలు తీరేదెప్పుడు

● అధికారుల అనాలోచిత డిజైన్‌తో నష్టపోతున్న రైతులు ● పెద్దవాగు ప్రాజెక్ట్ నీరందేది ప్రశ్నార్థకం
● వర్షాలు సమృద్ధిగా ఉన్నా పొలాలకు నీరందని వైనం ● రూ. 1.60 కోట్లతో 15 యేళ్ల క్రితం ఏర్పాటు



ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు, నీరు రాకుండా ఉన్న తూము

భీమారం, జనవరి 2: మండలంలోని కాజిపల్లి గ్రామంలో నిర్మించిన పెద్దవాగు ప్రాజెక్ట్ నిరుపయోగంగా మారింది. 15 సంవత్సరాల క్రితం రూ.కోటి అరవై లక్షల వ్యయంతో ప్రాజెక్ట్‌ను నిర్మించారు. కాజిపల్లి, ధర్మారం, దాంపూర్, నర్సింగాపూర్, బూర్గుపల్లి, పోతనపల్లి గ్రామాల రైతులు పంటలు సమృద్ధిగా పండించుకోవచ్చని సంబరపడ్డారు. కాని అధికారుల అనాలోచిత డిజైన్‌తో ప్రాజెక్టులో నీటి కంటే కాలువలు ఎత్తుగా నిర్మించడంతో సుమారు వెయ్యి ఎకరాలకు సాగు నీరు అందించే ప్రాజెక్టు కనీసం వంద ఎకరాలకు కూడా నీరందించకుండా మిగిలిపోయింది. సుమారు 150 ఎకరాల విస్తీర్ణంతో కోటి అరవై లక్షలతో భీమారం మండలంతో పాటు నెన్నెల మండలంలోని చిన్న వెంకటాపూర్, కొత్తూరు, పొట్యాల మీదుగా నీరు అందించే లక్ష్యంతో అధికారులు ప్రాజెక్టును నిర్మించారు. రెండు తూములను ఏర్పాటు చేసి రెండు వైపుల కాలువలు ద్వారా నీరందించాలని పనులు ప్రారంభించారు. ప్రాజెక్టుకన్నా కాలువలు ఎత్తుగా ఉండటంతో నీరు రాక నిరుపయోగంగా ఉంది. దీంతో పనులను అసంపూర్తిగానే వదిలేయడంతో ఆయకట్టు పొలాలకు నీరందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుత్తేదారుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంతో సుమారు ఏడు గ్రామాల రైతులకు నిరాశే మిగిలింది. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రాజెక్టులో నీరు ఉన్నా అధికారుల అనాలో చన డిజైన్‌తో కాజిపల్లి పెద్దవాగు ప్రాజెక్టు నిరుపయోగంగా మారింది. భూములు బీడుగా మారుతున్నాయని అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా ఈ ప్రాజెక్టు కాలువల నిర్మాణం పూర్తి స్థాయిలో నిర్మించి నీరందించాలని రైతులు వేడుకొంటున్నారు. ప్రాజెక్టు ఉన్నప్పటికి బోరు బావులు, వాగులు వంకల్లో నిలిచి ఉన్న నీటితో అయిల్ ఇంజన్‌ల మీద ఆధారపడి రైతులు సాగు చేస్తున్నారని, ఇప్పటికైనా అధికారులు రీడిజైనింగ్ చేసి ప్రాజెక్ట్ నీరు అందించే దిశగా అడుగులు వేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

కాలువలను రీడిజైన్ చేయాలి

-గోదారి ప్రభాకర్, కాజిపల్లి



పెద్దవాగు కాలువల నిర్మాణం రీజైనింగ్ చేసి పంట పొలాలకు నీరందించాలి. పదేళ్ల నుంచి వర్షాలు సమృద్ధిగా కురిసినా అధికారుల తప్పుడు డిజైన్‌తో ఈ ప్రాంత రైతులు నష్టపోతున్నారు. రీడిజైన్ చేసి కాలువ నిర్మాణం చేపడితే పెద్దవాగు ప్రాజెక్టుకు అనుబంధంగా ఉన్న దాంపూర్, నర్సింగాపూర్, బూర్గుపల్లి చెరువుల్లో నీటిని నింపవచ్చు. తద్వారా బోరు బావుల విద్యుత్ వినియోగం తగ్గుతుంది.

భీమారం మండలంతోపాటు నెన్నెలలోని కొన్ని గ్రామాలకు సాగు నీరందించేందుకు పెద్దవాగుపై ప్రాజెక్ట్ నిర్మించారు. ప్రాజెక్ట్ పూర్తికావడంతో సాగు కష్టాలు తీరుతాయని రైతులు ఆశించారు. అయితే ప్రాజెక్ట్ కన్నా ఎత్తుగా కాలువ నిర్మాణం చేపట్టారు. దీంతో ప్రాజెక్ట్ నిండా నీరున్నా నిరుపయోగంగా మారింది. రైతుల ఆశలు నిరాశలయ్యాయి. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కాలువల రీడిజైన్ చేసి సాగు నీరందించాలని రైతులు కోరుతున్నారు.

పంటలు సమృద్ధిగా పండుతాయి

డోంగిరి రాజలింగు, కాజిపల్లి



పెద్దవాగు ప్రాజెక్టు నిర్మాణం అధికారుల, గుత్తేదారుల అలసత్వంతో, నిర్లక్ష్యంతో డిజైనింగ్ సరిగ్గా లేక పంట పొలాలకు నీరు అందడంలేదు. గత ప్రభుత్వం కొంత కాలువల పనులు చేపట్టింది. వాటిని వెంటనే పూర్తి చేసి రైతులకు నీరందించాలి. దీంతో ఈ ప్రాజెక్టుపై ఆధారపడిన గ్రామాల రైతుల భూముల్లో పంటలు పండి రైతులు సంతోషంగా ఉంటారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

శారద, డీఈ, నీటిపారుదల శాఖ,



కాజిపల్లి, దాంపూర్, ధర్మారం, నర్సింగాపూర్, బూర్గుపల్లి గ్రామాలతోపాటు నెన్నెల మండలంలోని పలు గ్రామాలకు సాగు నీరందించేందుకు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్టుకు కాలువలకు రీడిజైన్ చేయాలని ఎటువంటి దరఖాస్తులు రాలేదు. ఒక వేళ దరఖాస్తులు వచ్చినట్లయితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి నిర్మిస్తాం. ఉపాధిహామీ పథకాన్ని ఉపయోగించుకొని స్థానిక రైతులు కాలువలను ఏర్పాటు చేసుకోవచ్చు.

ఇథనాల్ కంపెనీల అనుమతులు రద్దు చేయాలి

- కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ పిలుపు

మంచిర్యాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ ఇంధనం దిగుమతులపై అయ్యే ఖర్చును తగ్గించే పేరుతో ఇథనాల్ ఉత్పత్తికి ఏర్పాటు చేస్తున్న కంపెనీలకు అనుమతులు రద్దు చేయాలని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధికార ప్రతినిధి జగన్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇథనాల్ కంపెనీలతో వేలాది ఎకరాల భూములు, ప్రజలు జీవనోపాధిని కోల్పోతున్నారన్నారు. సాగు, తాగు నీరు, వాయు కాలుష్యాలతో రోగాల బారిన పడుతున్నారన్నారు. కంపెనీలకు భూములు అప్పగిస్తే రైతులు కూలీలుగా మారతారని ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణ్‌పేట్ జిల్లా చిత్తనూర్‌లో ఏర్పాటు చేసిన ఇథనాల్ పరిశ్రమతో 54 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వారు రెండేళ్లుగా కంపెనీ మూసివేయాలని పోరాడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వాలు ఇథనాల్ కంపెనీలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పాక్షికంగా పలు రైళ్లు రద్దు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 2: ఉప్పల్-హసన్‌పర్తి స్టేషన్‌ల మధ్య నడుస్తున్న నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా సిర్పూర్-కాగజ్‌నగర్ మధ్య నడిచే భాగ్యనగర్, కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, రామగిరి, మంచిర్యాల-కరీంనగర్ పుష్‌పుల్ రైళ్లను రద్దు చేసినట్లు మంచిర్యాల రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్ నడిచే ఇంటర్ సిటీ రైలు మాత్రమే నడుస్తుందనీ ప్రయాణికులు గమనించాలని కోరారు.

రాములోరి అక్షింతలకు ఘన స్వాగతం


రాముని అక్షింతలకు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

చెన్నూరు, జనవరి 2: అంగరాజ్‌పల్లిలో మంగళవారం అయోధ్య రాములోరి అక్షింతలకు ఘన స్వాగతం పలికారు. గ్రామ పొలిమేరల నుంచి హనుమాన్ మందిరం వరకు శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు.

నెన్నెల: అయోధ్య రాముని పూజిత అక్షింతలతో నెన్నెలలో శోభాయాత్ర నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రామనామ స్మరణతో గ్రామం మార్మోగింది. మంగళహారతులు, కోలాటాలతో మహిళలు స్వాగతం పలికారు.

మందమర్రి రూరల్: పొన్నారంలో అక్షింతలను ఇంటింటికి తిరిగి అందజేశారు. శోభాయాత్ర గ్రామంలో నిర్వహించారు.

కాసిపేట: అయోధ్య అక్షింతలు దేవాపూర్ చేరుకున్నాయి. అయ్యప్ప టెంపుల్ చైర్మన్ గొంది వెంకటరమణ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. మహిళలు ఆటాపాటలతో శోభాయాత్ర నిర్వహించారు.

రైతులు సాగు నీటిని పొదుపుగా వాడుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 2: ఆయకట్టు రైతులు యాసంగి పంటకు సాగు నీటిని పొదుపుగా వినియోగించాలని కడెం ప్రాజెక్టు ఇరిగేషన్ శాఖ ఈఈ విఠల్ ఒక ప్రకటనలో తెలిపారు. కడెం ప్రధాన కాలువ చివరి ఆయకట్టు డి-30, 42 పరిధిలోని రైతులకు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు ఆధ్వర్యంలో నీటిని ఈనెల 6న విడుదల చేయనున్నట్లు తెలిపారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం

జన్నారం, జనవరి 2, : జన్నారం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన భూపెల్లి ప్రసాద్‌రాణి దంపతుల కుమారుడు వర్షిత్ కేన్సర్‌తో బాధపడుతున్నాడు. హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించగా రూ.10లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో రాంపూర్‌లో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న వర్షిత్ దుస్థితిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకటలక్ష్మి వాట్సాప్ గ్రూప్ ద్వారా షేర్ చేశారు. దీంతో దాతల సహకారంతో రూ. 28వేలు పోగు చేసి వైద్య ఖర్చుల కోసం విద్యార్థి తల్లిదండ్రులకు అందజేస్తారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం




దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి, దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, దరఖాస్తులు స్వీకరిస్తున్న డిప్యూటీ కలెక్టర్ సిడాం దత్తు

హాజీపూర్, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చేపట్టే సంక్షేమ ఫలాలు అందరికీ అందిస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గుడిపేటలో ప్రజాపాలనకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని 311 గ్రామ పంచాయతీలు, 7 పురపాలక సంఘాలలో దరఖాస్తుల స్వీకరణకు 1,702 కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు జిరాక్స్ జతపరచాలని, రేషన్ కార్డు జిరాక్స్ లేకున్నా తీసుకుంటామని వివరించారు. జడ్పీ సీఈవో నరేందర్, ఎస్‌సీడీడీ డైరెక్టర్ పోటు రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు: నిరుపేదల అభ్యున్నతి కోసమే ప్రజాపాలన ప్రవేశపెట్టామని ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి అన్నారు. మంగళవారం 1వ వార్డు, బావురావుపేట గ్రామాల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. డీఆర్‌డీఓ శేషాద్రి, మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన, కమిషనర్ గంగాధర్, కౌన్సిలర్లు సతీష్, శ్రీనివాస్, శంకర్, పీఏసీఎస్ చైర్మన్ రాం రెడ్డి, మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ రాజరెడ్డి పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: అర్హులందరికి గ్యారంటీ పథకాలు అందించాలన్న ఉద్దేశంతోనే ప్రజాపాలన ప్రవేశపెట్టామని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబం లబ్ధి పొందడం కోసం విచ్చలవిడిగా కుంభకోణాలకు పాల్పడ్డారని విమర్శించారు. త్వరలోనే మందమర్రిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తానని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మీ ఓదెలు, మున్సిపల్ కమిషనర్ రాజు, డీఆర్‌డీవో శేషాద్రి పాల్గొన్నారు.

దండేపల్లి: ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సంతోష్ కోరారు. వెల్గనూర్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదల కోసం ఆరు గ్యారంటీ పథకాలను చేపట్టిందన్నారు. దరఖాస్తు ఫారంతో ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులను జతపరచాలన్నారు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంఖ్యను కేటాయించాలని ఆదేశించారు. ఎంపీడీవో మల్లేషం, సర్పంచు బిల్లకూరి శంకరయ్య, ఈవో అంజిత్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: గ్రామసభల్లో అర్హులైన వారందరూ దరఖాస్తులు చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కార్కూరి రాంచందర్, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి కోరారు. పెర్కపల్లిలో గ్రామ సభ నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. సింగతి సత్యనారాయణ, ఉపసర్పంచ్ సుధాకర్, ఎంపీడీవో రాజేందర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భీమిని: భీమినిలో సర్పంచ్ కమలాబాయి అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్‌గుప్తా, ఎంపీపీ రాజేశ్వరి, జడ్పీటీసీ గంగక్క, తహసీల్దార్ బికర్ణదాస్, శేఖ్ సప్దర్ అలీ, సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

నెన్నెల: మైలారం, చిత్తాపూర్ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. మైలారంలో డిప్యూటీ కలెక్టర్, మండల స్పెషల్ ఆఫీసర్ సిడాం దత్తు ప్రారంభించారు. తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో వరలక్ష్మి, ఏవో ప్రేమ్‌కుమార్, ఎంపీవో శ్రీనివాస్, ఏపీఎం విజయలక్ష్మి, సర్పంచులు లక్ష్మి, బత్తిని పద్మ పాల్గొన్నారు.

కాసిపేట: ధర్మారావుపేట, లంబాడితండా (డీ), మల్కెపల్లి, రొట్టెపల్లిల్లో గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచులు కుడిమేత లక్ష్మి, పెంద్రం కవిత, అజ్మీరా తిరుపతి, ఎంపీటీసీలు మాడవి భీంరావు, పర్వతి మల్లేష్, తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో అలీం పాల్గొన్నారు.

కన్నెపల్లి: మాడవెల్లి, జజ్జరెల్లి, సాలిగామ గ్రామాల్లో అధికారులు ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంపీడీఓ రాధాకృష్ణ, ఆర్ఐ కిషన్, ఏఈ బాపూరావు, ఏఓ శ్రీకాంత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిరా, నాయకులు రామారావు తతదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

దండేపల్లి, జనవరి 2: పెండింగ్‌లో ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్షకార్యదర్శులు రావనవేని రవి, మల్యాల మల్లేష్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం విద్యావనరుల కేంద్రం ఆవరణలో సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను సంక్రాంతి కానుకగా ఇవ్వాలన్నారు. పదోన్నతులు, బదిలీల షెడ్యూల్, 317 జీవో బాధితులను సొంత జిల్లాలకు పంపించే విధంగా కార్యాచరణ ప్రకటించాలన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు, సీఆర్టీల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. దుర్గం చిన్నయ్య, అప్పాల మనోహర్, వరలక్ష్మి,రమేష్, నరేందర్, రాజమౌళి, శ్రీనివాస్, లచ్చన్న సర్పయ్య, పాల్గొన్నారు.

భీమిని: పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఎంపీడీవో జవహర్‌లాల్ వీగాం ప్రాథమిక పాఠశాల ఆవరణలో విడుదల చేశారు. మండల అధ్యక్షుడు తిరుపతి మాట్లాడుతూ సీపీఎస్ రద్దు కోసం ఉద్యమం తీవ్రతరం చేస్తున్నామన్నారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్ హరిప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ అంజయ్య, ఉపాధ్యయులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు డీఏ విడుదల చేయాలి

దండేపల్లి, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల, ఉపాధ్యాయుల డీఏను విడుదల చేయాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు భుక్యా రూప్లానాయక్, భనవత్ ప్రకాష్‌లు కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన 3 విడుతల డీఏ విడుదల చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత

జన్నారం, జనవరి 2: జన్నారం మండలం కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్‌ఆర్‌ఐ రేణికుంట నవీన్‌కుమార్ అందజేసిన ఏకరూప దుస్తులు, ట్రాక్‌సూట్స్ మంగళవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం అందజేశారు. ఉపాధ్యాయులు రమేష్, తిరుపతి, సాగర్, రాజేందర్, కవిత, శ్రీనివాస్, పాల్గొన్నారు.

పెట్రోల్ కోసం వాహనదారుల బారులు


ఆసిఫాబాద్‌లో బారులు తీరిన వాహనదారులు

ఆసిఫాబాద్, జనవరి 2: జిల్లా కేంద్రంలో పెట్రోల్ కోసం వాహనదారులు బారులు తీరారు. ఆయిల్ ట్యాంకర్లు డ్రైవర్ల సమ్మెతో జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడింది. సోమవారం అయిల్ ట్యాంకర్ల యజమానులు, డ్రైవర్లు సమ్మెకు దిగడంతో బంకులకు పెట్రోల్, డీజిల్ సరఫరా నిలిచి పోయింది. దీంతో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పెట్రోల్ బంక్‌లు మంగళవారం మూస వేశారు. బంకుల ముందు నో స్టాక్ బోర్డులు పెట్టారు. అయితే తెరచి ఉన్న కొన్ని పెట్రోల్ బంకుల ముందు వాహనదారులు పెట్రోల్ కోసం క్యూ కట్టారు. జిల్లా కేంద్రంలోని జైలు శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పెట్రోల్ బంక్‌లో వాహనదారులు భారీ సంఖ్యలో క్యూలో నిలిబడి ఇబ్బందులు పడ్డారు.

శబరికి బయలు దేరిన అయ్యప్ప స్వాములు

కాగజ్‌నగర్, జనవరి 2: కాగజ్‌నగర్ అయ్యప్ప దీక్షా తీసుకున్న స్వాములు మంగళవారం శబరికిబయలు దేరి వెళ్లారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయంలో ఇరుముడి కార్యక్రమాన్ని గురుస్వాములు నిర్వహించారు. అనంతరం రైలు ద్వారా శబరికి బయలు దేరి వెళ్లారు. ఈ సందర్భంగా దీక్ష తీసుకున్న స్వాముల కుటుంబ సభ్యులు వీడ్కోలు పలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, దీక్షా స్వాములు పాల్గొన్నారు.

రెబ్బెన: మండల కేంద్రంలో అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములు మంగళవారం శబరికి బయలు దేరి వెళ్లారు. గోలేటి కోదండ రామాయలంలో గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఉదయం రైలు ద్వారా శబరికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దీక్ష స్వాములు సుధాకర్ స్వామి, ప్రకాష్ స్వామి, మహేందర్ స్వామి, సప్త శ్రీనివాస్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి


మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

సిర్పూర్(టి), జనవరి 2: ప్రజాపాలన పథకాలపై ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా చూడాలని జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో గ్రామ సభ నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్ కోనేరు కృష్ణారావుతో కలిసి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క లబ్ధిదారుడు దరఖాస్తు చేసుకునేలా చూడాలని చెప్పారు. దరఖాస్తు ఫారంలో ఏమైన తప్పొప్పులు ఉంటే సరి చేసేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల వరకే పార్టీలని అందరు సిర్పూర్ అభివృద్ధికి పాటు పడాలన్నారు. అభివృద్ధియే ఎజెండా అని అన్నారు. మండలంలోని పెద్దబండ నుంచి కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వరకు జాతీయ రహదారి మంజూరైందని, త్వరలోనే పనులను ప్రారంభం కానున్నట్లు తెలిపారు. అలాగే మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అనంతరం మండడంలో పలువురికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కాగా మొదటి సారిగా సిర్పూర్(టి)కి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సురేష్‌బాబు, ఎంపీపీ సువర్ణ, జడ్పీటీసీ రేఖ, సర్పంచ్ తఫీమా పర్వీన్, ఎంపీటీసీలు సోహెల్ అహ్మద్, మంగిలాల్, కో ఆప్షన్ సభ్యుడు కీజర్‌హుస్సెన్, నాయకులు శంకర్, సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

తిర్యాణి, జనవరి 2: తిర్యాణి మండలం గిన్నెదరి సాలెగూడ గ్రామానికి చెందిన దేవేంద్ర(31) అనే వివాహిత ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవేంద్రకు ఆరు నెలల క్రితం కుడిమెత నాగేష్ అనే యువకుడితో పెళ్లి అయింది. ఆమె అనారోగ్యానికి గురి కావడంతో కొన్ని రోజుల నుంచి తల్లిగారి ఇంటి వద్ద ఉంటూ చికిత్స పొందుతున్నది. దేవేంద్ర చలిమంట కాగుతున్న సమయంలో తాను వేసుకున్న నైటీకి మంటలు అంటుకున్నాయి. ఆమె కేకలు వేయడంతో తల్లిదండ్రులు, చుట్టు పక్కల వారు వచ్చి మంటలను ఆరిపి వేశారు. వైద్యుల సూచన మేరకు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

తిర్యాణి, జనవరి 2: మండల కేంద్రంలోని పాత సమ్మక్క గద్దల వద్ద గంజాయిని తీసుకు వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గుండిపేట గ్రామానికి చెందిన కోట్నాక గణపతి, గిన్నెధరి గ్రామానికి చెందిన మడావి బొజ్జురావులు గంజాయిని తీసుకెళ్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడిచేసి ఇద్దరిని పట్టుకున్నట్లు తెలిపారు. డీటీ వంశీకృష్ణ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి వారి వద్ద నుంచి 100 గ్రాముల గంజాయిని స్వాధీన పర్చుకున్నామని ఎస్సై తెలిపారు. గంజాయి విక్రయాలపై నిఘా ఉందని తెలిపారు.

శ్రీరామ పూజిత అక్షింతలతో శోభాయాత్ర


కౌటాలలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

కౌటాల, జనవరి 2: మండల కేంద్రంలో మంగళవారం శ్రీరామ పూజిత అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. మండలంలోని తలోడి హనుమాన్ ఆలయం నుంచి సదాశివపేట, బస్టాండు మీదుగా కంకాలమ్మ ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహిం చారు. 15 ఫీట్ల రాముడు ప్రతిమ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు శోభాయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భక్తులు సత్యనాఆరాయణ, తిరుపతిరెడ్డి, వెంకటేష్, ప్రజావిధన్‌రెడ్డి, సాయిరాం, ప్రబీర్ మండల్, మిథున్, సాయికృష్ణ, బాలు, సాయి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

సిర్పూర్(యు), జనవరి 2: మండల కేంద్రంలోని దేవుగూడలో మంగళవారం పేద ప్రజలకు ఎస్సై రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలు చలితో ఇబ్బందులు పడుతున్నందున ఇన్‌కంటాక్స్ అడిషనల్ కమిషనర్ ప్రకాష్ రాథోడ్ సహకారంతో ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ ఆత్రం నేహ్రూ, ఆత్రం జ్యోతిరాం, సొసైటీ కోఆర్డినేట్ ఆడ వెంకటేష్, ఆత్రం లింబారావు పాల్గొన్నారు.

సిర్పూర్(యు): మండలంలోని రాంపూర్(బాబ్జిపేట్)లో పేదలకు బ్లాంకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 20 కుటుంబాలకు జైనూర్ రాణి దుర్గవతి మహిళా ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లాంకెట్లు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు గోడం జంగుబాయి, ఉయక తుల్సీబాయి, మెస్రం కమలబాయి, కుర్సెంగ గంగామణి కుంరం అనుసూయ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆనంద్ మేళా


నృత్యం చేస్తున్న విద్యార్థులు

కాగజ్‌నగర్, జనవరి 2: కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం రాత్రి ఎస్పీఎం క్రీడామైదానంలో ఇండియన్ మోక్షిత డ్యాన్సు అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆనంద్ మేళా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీఎం అడిషనల్ జీఎం గిరిష్, తెలంగాణ డ్యాన్స్ స్పోర్ట్స్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. కాగజ్‌నగర్‌లో ఆనంద్ మేళా నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ ప్రాంతంలో ప్రతిభ కలిగిన విద్యార్థులకు అవకాశం దొరుకుతుందన్నారు. ఇలాంటి వేదికలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ సీఐ నాగరాజు, ఇండియన్ మోక్షిత డ్యాన్సు అకాడమీ ఫౌండర్ డొంగ్రీ సంతోష్, లయన్స్‌క్లబ్ డైరెక్టర్ కోట వెంకన్న, మంచిర్యాల సీనియర్స్ డ్యాన్సు మాస్టర్లు దుర్గం విజయ్, స్థానిక డ్యాన్సు మాస్టర్లు, నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి

పెంచికలపేట, జనవరి 2: యువకులు క్రీడా స్ఫూర్తిని అలవరుచుకోవాలని ఎస్సై కొము రయ్య అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో మంగళవారం స్థానిక సర్పంచ్ సంజీవ్‌తో కలిసి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడాస్ఫూర్తిని అలవర్చుకొని ముందుకు సాగాలని యువత వ్యసనాలకు దూరంగా ఉండడంతో పటు సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంజీవ్, నాయకులు సుధాకర్, లచ్చన్న, సాయికిరణ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కౌటాల, జనవరి 2: కౌటాల మండలం గుండాయిపేట గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత, సాంకేతిక అక్షరాస్యతపై టీజీబీ మేనేజర్ నరసింహస్వామి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి సురక్షణబీమా యోజన, ప్రధాన మంత్రిజీవనజ్యోతి బీమా, తదితర పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అకౌంటెంట్ రాజేష్, ఉప సర్పంచ్ లంహంచు, కారోబార్ బణీత్, సీఏ శంకర్, సీఎస్పీ ప్రకాష్, సంతోష్, తుకారాం, అశోక్,శ్యాం రావు, దాదాజీ, ఆనంద్‌రావు, అబాజీ, బాలాజీ పాల్గొన్నారు.

జెండా పండుగ నిర్వహించుకోవాలి

కౌటాల, జనవరి 2: కొలావార్ గూడల్లో ఈ నెల 8న ఆదివాసీ కోలావార్ ఆత్మగౌరవ దినోత్సవం భీమదేవర జెండా పండుగను నిర్వహించుకోవాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పారిపెల్లి పోశం, భీమయ్య, బ్రహ్మయ్య, సదాశివ్, సత్తయ్య, బి.సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

వాంకిడి, జనవరి 2: విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ అన్నారు. వాంకిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్యం ఏర్పరుచుకుని క్రమశిక్షణతో చదవాలని సూచించారు. యువత వ్యవనాల బారిన పడొద్దని చెప్పారు. క్రమశిక్షణతో చదివి లక్ష్యం చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోపీ చంద్రయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

అసౌకర్యాల క్వార్టర్లు

- పాతబడిన క్వార్టర్లతో సింగరేణి కార్మికుల ఇబ్బందులు
- సొంతంగా నిర్మాణానికి దరఖాస్తులు
- నెలల తరబడి అనుమతులు పెండింగ్
- నిర్మాణం చేపడితే కూల్చివేతలు



నస్పూర్ కాలనీలో ఎస్ అండ్ పీసీ సిబ్బంది కూల్చిన నిర్మాణం

సింగరేణి కార్మికులకు కేటాయించిన క్వార్టర్లు అసౌకర్యాలకు నెలవుగా మారాయి. ఏళ్లనాటి నిర్మాణాలు కావడంతో పైకప్పులు పెచ్చులూడుతున్నాయి. వర్షానికి ఉరుస్తుండడంతోపాటు గోడలు పగుళ్లు చూపుతున్నాయి. ఉన్న గదులు ఇరుకుగా మారడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరమ్మతులు చేయించాలని కోరితే నెలలు గడిచినా వాటికి మోక్షం లభించడం లేదు. ఫలితంగా కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

శ్రీరాంపూర్, జనవరి 2 : అసలే చిన్న క్వార్టర్లు.. ఆపై అసౌకర్యాలకు నెలవు.. లోపల ఖాళీగా ఉన్న స్థలంలో ఏదైనా నిర్మాణం చేపడుదామంటే అనుమతులు తప్పనిసరి.. దరఖాస్తు ఇచ్చినా నెలల తరబడి పెండింగ్. ఒకవేళ ఎవరైనా చిన్న కట్టడం నిర్మించేందుకు ప్రయత్నిస్తే ఎస్టేట్ అధికారుల నుంచి వాటి కూల్చివేతకు ఆదేశాలొస్తున్నాయి.. దీనిని అవకాశంగా మల్చుకుంటున్న ఎస్అండ్‌పీసీ సిబ్బంది కార్మికుల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. డబ్బులిస్తే సరి. లేదంటే దౌర్జన్యమే జరుగుతోంది. ఇలాంటి ఘటనలు ఇటీవల శ్రీరాంపూర్ ఏరియాలో పెరిగిపోతుండడంతో కార్మికవర్గం ఆందోళన చెందుతోంది. వారి కుటుంబాలు ఇక్కట్లకు గురవుతున్నారు.

కుటుంబానికి సరిపోని క్వార్టర్లు

శ్రీరాంపూర్, సీసీసీ ఏరియాలో మొత్తం 6850 క్వార్టర్లున్నాయి. ప్రస్తుతం ఉన్న క్వార్టర్లు 30, 40 ఏళ్ల క్రితం నాటివి. అవి ఆనాటి అవసరాలకు అనుగుణంగా నిర్మించారు. ప్రస్తుతం సౌకర్యాలు అదనంగా కల్పించాల్సి ఉంది. కానీ యాజమాన్యం వాటిపై దృష్టి పెట్టడం లేదు. ఆయా క్వార్టర్లలో కార్మికుడు, భార్య, ఇద్దరు పిల్లలకే సరిపోతుంది. ఒక్కరు అదనంగా ఉన్నా ఇబ్బందే. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ డబుల్ బెడ్ రూం క్వార్టర్లు కట్టిస్తామని చెప్పుండేవారు.

ప్రైవేటు వారికి ఫుల్ సౌకర్యాలు

సింగరేణి కార్మికులు క్వార్టర్లలో నివాసం ఉంటే వారికి వేతనం నుంచి సంబంధిత హెచ్ఆర్ఏ మినహాయించుకుంటున్నారు. బదిలీ వర్కర్ నుంచి సీనియర్ సర్దార్ వరకు ఒకే మాదిరి చిన్న, చిన్న క్వార్టర్లలో ఉంటుండగా, అదే ప్రైవేటు వ్యక్తులు అధికారులు ఉండే క్వార్టర్లలో నివసిస్తున్నారు. సింగరే జేతరులైన ఇతర శాఖలకు చెందిన అధికారుల నుంచి ఆఫీస్ సబార్డినేట్ వరకు సింగరేణి క్వార్టర్లలో సౌకర్యాలు అనుభవిస్తున్నారు. ఏసీలు, ఇతర గృహోపకరణాలు వినియోగిస్తూ దర్జాగా నివసిస్తున్నారు. అధికారుల క్వార్టర్లకు ఎలాంటి మరమ్మతు లైనా వెంటనే చేయిస్తున్నారు. డోర్లు సక్రమంగా లేవని, కరెంటు ఫిటింగ్‌లు కావాలని, ఇతర సమస్యల గురించి ఎన్ని ఫిర్యాదు లిచ్చినా వాటికి మోక్షం కలగడం లేదు. చివరికి విసిగి వేసారి ఎవరైనా కార్మికుడు చిన్న సిమెంట్ పని మొదలు పెట్టినా దానిని నిలిపి వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అయితే క్వార్టర్లు కేటాయించేటప్పుడే వాటిని ఎలాంటి మార్పులకు గురి చేయరాదని నిబంధనలు పేర్కొంటున్నాయని, దాని ప్రకారమే తాము చర్యలు చేపడుతున్నామని అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు కార్మికులకు ఇచ్చిన క్వార్టర్లు సరిపోవడం లేదని, క్వార్టర్ల ముందు అవసరమైన షెడ్లతో పాటుగా ఇతర అవసరాలకు అనుగుణంగా సింగరేణి యాజమాన్యం నిర్మించి ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.





అధ్వాన స్థితిలో ఉన్న క్వార్టరు

దరఖాస్తులు పెండింగ్

కార్మికులు నిర్మించే క్వార్టర్లలో ఏదైనా నిర్మాణం చేపట్టాలంటే ఎస్టేట్ అధికారులకు దరఖాస్తు చేసుకుంటారు. దీనిని పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. సంబంధిత అధికారులు దరఖాస్తులను నెలల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారు. తమ దరఖాస్తు పరిస్థితి ఏంటని కార్మికులు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. అనుమతి మాత్రం త్వరగా రావడం లేదు.

మొదలు పెడితే అంతే

దరఖాస్తు చేశామని ఎవరైనా నిర్మాణం మొదలు పెడితే ఎస్అండ్‌పీసీ సిబ్బంది అక్కడ వాలిపోతారు. అనుమతి లేదని నిలిపివేయాలని డిమాండ్ చేస్తారు. వారికి ఎంతో కొంత ముట్టజెప్పితే పనులు ఆపకుండా వెళ్తున్నారు. లేదంటే ఆ నిర్మాణాలను కూల్చివేసేదాకా వదలడం లేదు. ఇటీవల నస్పూర్ కాలనీలో ఓ కార్మికుడు చేపట్టిన నిర్మాణాన్ని ఎస్అండ్ పీసీ సిబ్బంది కూల్చివేయడంతో వాగ్వాదం నెలకొంది. తనను డబ్బులు డిమాండ్ చేశారని బాధితుడు, తాము నిబంధనల ప్రకారమే వ్యవహరించామని సిబ్బంది పేర్కొన్నారు.

స్తంభాలు తొలగించకుండానే రోడ్డేశారు...



సిమెంట్ రోడ్డు చివరన విద్యుత్ స్తంభాలు

నస్పూర్, జనవరి 2: నస్పూర్ గేట్ నుంచి పెద్దమ్మ గుడి వరకు రూ.88 లక్షలతో రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. నస్పూర్ గేట్ నుంచి చేపట్టిన విస్తరణలో భాగంగా ఇరువైపుల రెండున్నర మీటర్ల విస్తీర్ణంతో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కొన్ని చోట్ల సిమెంట్ రోడ్డు మధ్యలోనే స్తంభాలను అలాగే వదిలిపెట్టారు. ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అధికారుల దృష్టికి పలువురు తీసుకెళ్లారు. పెద్దమ్మ గుడి సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించకుండానే రోడ్డు పనులు చేపట్టారు.

ఈ విషయమై విద్యుత్ ఏఈ మధును అడుగగా నస్పూర్ గేట్ నుంచి రోడ్డు విస్తరణలో భాగంగా పక్కన ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపునకు విద్యుత్ శాఖకు షిఫ్టింగ్ ఛార్జీల కింద రూ.3.90లక్షలను చెల్లించాం. విద్యుత్ స్తంభాలను తొలగిస్తారు. విద్యుత్ స్తంభాలను సిమెంట్ రోడ్డు అంచున ఉన్న వాటిని షిఫ్టింగ్ చేసి ఏర్పడిన గోతిలో తిరిగి సిమెంట్ చేస్తాం. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడుతాం.

యాసంగి సాగుకు సమృద్ధిగా నీరు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 2: జిల్లాలో యాసంగి సాగుకు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గూడెం ఎత్తిపోతల ద్వారా సమృద్ధిగా నీరు విడుదల చేస్తామని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేం సాగర్‌రావు, ఆర్డీవో రాములు, నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యాసంగి సాగు కోసం దండెపల్లి, హాజీపూర్, లక్షెట్టిపేట మండలాలలో దాదాపు 15 వేల ఎకరాల ఆయకట్టుకు ఈనెల 6న నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ యాసంగి సాగుకు చెరువులు, బావులు నింపుతామని, నీటి లీకేజీ, విద్యుత్ హెచ్చుతగ్గులు లేకుండా అధికారులు చూడాలని పేర్కొన్నారు. 90 రోజులపాటు నీటిని అందిస్తామని, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సాగు చేసుకోవాలని సూచించారు. ఈఈ దశరథం, ఎల్లంపల్లి డిప్యూటీ ఈఈ బుచ్చిబాబు అధికారులు పాల్గొన్నారు.

మిషన్‌భగీరథ ద్వారా నిరంతరం నీరు

మిషన్‌భగీరథ ద్వారా నిరంతరం నీరు సరఫరా చేస్తామని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. మిషన్ భగీరథ అధికారులు ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. ఈనెల 14 నుంచి అన్ని మున్సిపాలిటీల్లో ప్రజలకు తాగు నీరు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పైప్ లైన్ లీకేజిలపై దృష్టి సారించాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.

ఆపరేషన్ స్మైల్‌ను విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఏసీసీ, జనవరి 2 : బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు చేపట్టిన ఆపరేషన్ స్మైల్‌ను విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఏసీపీ చిలుకూరి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం రామగుండం పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్యం అమూల్యమైందని, దానిని పొందడం బాలల ప్రాథమిక హక్కు అన్నారు. క్షణికావేశంలో పిల్లలు తల్లిదండ్రులతో మనస్పర్థలు తెచ్చుకొని ఇంటికి దూరంగా ఉంటున్నారని, దానిని అవకాశంగా తీసుకొని కొందరు ప్రమాదకర పనుల్లో నియమించుకొని వెట్టిచాకిరీ చేయిస్తున్నారన్నారు. బాలలను పనిలో పెట్టుకున్న వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తప్పిపోయిన పిల్లలను వెతికి తల్లిదండ్రుల చెంతకు చేర్చాలన్నారు. భిక్షాటన చేస్తున్న బాలలు, బాల కార్మికుల సమాచారం అందజేయడానికి 1098, 112పై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. రైల్వే, బస్ స్టేషన్లలో, పని ప్రదేశాలలో బాలల ను గుర్తించాలన్నారు. జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల్లో నాణ్యమైన విద్య



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

ఏసీసీ, జనవరి 2: గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందిస్తున్నామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాల పోస్టర్లను రీజినల్ కో-ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణితో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఐదో తరగతిలో అన్ని గురుకులాల్లో ప్రవేశాల కోసం ఉమ్మడి పరీక్షను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మెరుగైన విద్యను కార్పొరేట్ స్థాయిలో అందించడంతోపాటు నాణ్యమైన భోజనం, వసతి, యూనిఫాం, పుస్తకాలు, కాస్మొటిక్ చార్జీలు, అందిస్తున్నామన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. పీసీవో బాలభాస్కర్, లలితకుమారి, మోహన్ పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో బారులుదీరిన వాహనదారులు



పెట్రోల్‌బంక్ వద్ద వేచిఉన్న ప్రజలు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 2: పెట్రోల్ బంక్‌ల వాహనదారులు మంగళవారం సాయంత్రం బారులుదీరారు. ఆయిల్ ట్యాంకర్ అసోసియేషన్ సమ్మె పిలుపు నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ లభించదని వాహనదారులు క్యూ కట్టారు. ఉద్యోగులు, ప్రజారవాణా స్తంభించి పోతుందనే ప్రజలు బంకుల వద్దకు తరలివచ్చారు. అయితే సమ్మె విరమించామని, ట్యాంకర్లు నడుస్తాయని ప్రకటించారు.

సావిత్రిబాయి పూలే జీవితం సమాజ సేవకు అంకితం



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న బీసీ సంఘ నేతలు

నస్పూర్, జనవరి 2: సావిత్రిబాయి పూలే జీవితం సమాజ సేవకు అంకితమిచ్చారని బీసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు అన్నారు. ఆమె జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతి పత్రం అందించారు. ఆడపిల్లలకు విద్యను అందించిన మహిళా ఉపాధ్యాయురాలుగా నిలిచారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమె సేవలకు సరైన గుర్తింపు ఇవ్వలేదన్నారు. గుమ్మల శ్రీనివాస్, రాములు, రాజేశం, సతీష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

చిరుతపులి దాడిలో మేక మృతి

కోటపల్లి, జనవరి 2: మండలంలోని పిన్నారం అటవీ ప్రాంతంలో గజ్జెల దుర్గయ్యకు చెందిన మేకపై మంగళవారం చిరుతపులి దాడి చేసి హతమార్చింది. కాపరి గడ్డం కనకయ్య మేకలను తీసుకొని అడవికి వెళ్లగా చిరుత పులి దాడి చేయడంతో మేకలు చెల్లా చెదురయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఒక మేక అక్కడికక్కడే మృతి చెందింది. బిగ్గరగా కేకలు వేయడంతో చిరుతపులి మేకను వదిలేసి పారిపోయిందని కనకయ్య తెలిపాడు. మేక విలువ రూ.పదివేలు ఉంటుందని తనకు పరిహారం ఇవ్వాలని యజమాని దుర్గయ్య కోరాడు.

మాజీ సర్పంచ్‌కు నిధుల రికవరీ నోటీసులు

బెల్లంపల్లి, జనవరి 2: గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగానికి పాల్పడిన చంద్రవెల్లి మాజీ సర్పంచ్ కొమ్మెర వీణకు కలెక్టర్ రికవరీ నోటీసు జారీ చేశారు. వీణ సర్పంచ్‌గా ఉన్న 2014-15లో బీఆర్‌జీఎఫ్ నిధుల నుంచి రూ.4.80 లక్షలు దుర్వినియోగం చేశారనే ఆరోపణలున్నాయి. సీసీ రోడ్ల నిర్మాణం కోసం అడ్వాన్సుగా కొమ్మెర లక్ష్మణ్ పేరిట రూ.4.80 లక్షలకు చెక్కులు జారీ చేశారు. పనుల తాలూకు ఎంబీ రికార్డు చేయలేదు. నిధుల వినియోగంపై వివరణ కోరుతూ బెల్లంపల్లి ఎంపీడీవో షోకాజ్ నోటీసు ఇచ్చారు. సంతృప్తికరమైన సమాధానం రాలేదు. దీంతో కొమ్మెర వీణకు తాజాగా నిధుల రికవరీ నోటీసులు అందించారు. వారం రోజుల్లో జమ చేయాలని లేని పక్షంలో రెవెన్యూ రికవరీ చట్టం 1864 ప్రకారం చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు.

మట్టి గాజులకు భలే డిమాండ్

- ఒక కొడుకున్న తల్లులు ధరించాలని పుకార్లు



నెన్నెల, జనవరి 2: మట్టి గాజులకు డిమాండ్ ఏమిటని ఆశ్చర్యపోతున్నారా ! నిజమేనండి.. ఒక కొడుకున్న తల్లులు ఐదు రంగుల గాజులు ధరించాలనే పుకార్లు షికారు చేస్తున్నాయి. ఏకైక మగ సంతానం గల వారు ఇద్దరు కొడుకులున్న ఐదుగురు తల్లుల వద్ద భిక్షాటన చేసి ఆ డబ్బులతో గాజులు వేసుకోవాలనే ప్రచారం జోరుగా సాగుతోంది. సంక్రాంతి పండుగ మంచి ముహూర్తంలో రాలేదని... పండుగ కంటే ముందుగా గాజులు వేసుకోవాలని చెప్పుకుంటున్నారు. 'మా ఊళ్లో ఐదు రంగుల గాజులు ధరిస్తున్నారు... మరి మీరు కూడా వేసుకుంటున్నారా...' అంటూ బంధువులకు, తెలిసిన వారికి ఫోన్లు చేసి ఆరా తీస్తున్నారు. ఫలితంగా గాజుల దుకాణాలు, కంగన్‌హాళ్లలో మహిళల సందడి నెలకొంది.